సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం ౹ 17 ౹ జూన్ ౹ 2023



రైలు ప్రమాదాలు జరగకుండా చర్యలు

రైల్వే సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వహించినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని గుంతకల్లు డీఆర్‌ఎం తెలిపారు. - 8లో



పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

వాతావరణ అనుకూలతను ఆసరాగా చేసుకుని రైతులు పచ్చిరొట్ట సాగు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. -8లో



మహిళా డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ టీం

కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ పీర్ కమిటీ పరిశీలించింది. - 8లో

జలకళ.. పథకం భళా

- జలకళ పథకం ద్వారా రైతులకు బోరు, మోటారు ఉచితం
- 660 అడుగుల వరకు పరిమితి
- జిల్లాలో ఇప్పటివరకు వేసిన బోర్లు 728
- 659 బోర్లు విజయవంతం... 69 బోర్లు విఫలం
- జగనన్న తోడ్పాటును కొనియాడుతున్న రైతన్నలు



వైఎస్సార్ జలకళ పథకం ద్వారా అట్లూరు పంచాయతీలోని చిన్నపురెడ్డి భూమిలో వేసిన బోరు

కడప సిటీ: రాష్ట్ర ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు ప్రభుత్వం నవరత్నాలు పథకాలను ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే 'వైఎస్సార్ జలకళ'ను అమలు చేస్తోంది. చిన్న, సన్నకారు రైతులతోపాటు 2.5 నుంచి 10 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరిని ఈ పథకం కింద చేర్చారు. రైతుల వ్యవసాయ భూమిని సేద్యానికి అనుకూలంగా మార్చేందుకు, భూగర్భ జలాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకునేందుకు వ్యవసాయ ఉచిత బోరుబావుల తవ్వకం చేసేందుకు, వ్యవసాయ యోగ్యమైన భూమిని ప్రతి ఎకరా సాగులోకి తెచ్చేందుకు వైఎస్సార్ జలకళ పథకాన్ని 2020 సెప్టెంబరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పథకం వల్ల రైతుల బీడు భూముల్లో పండ్ల తోటల పెంపకాన్ని, ఇతర ఆరుతడి పంటలను సాగు చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని ఈ పథకాన్ని ముఖ్యమంత్రి తీసుకు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇప్పటివరకు 728 బోర్లు

వైఎస్సార్ జిల్లాలోని బద్వేలు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట (సిద్దవటం, ఒంటిమిట్ట) ప్రాంతాల పరిధిలోని గ్రామాల్లో ఇప్పటివరకు 728 బోర్లను ఈ పథకం ద్వారా రైతులకు వేశారు. అయితే ఇందులో 659 బోర్లు విజయవంతం కాగా, కేవలం 69 మాత్రమే విఫలమయ్యాయి.

660 అడుగుల వరకు పరిమితి: వైఎస్సార్ జలకళలో భాగంగా అర్హులైన రైతుల భూముల్లో బోర్లు వేస్తున్నారు. ఈ పథకం ద్వారా 660 అడుగుల వరకు బోరు వేసేందుకు అనుమతి ఉంటుంది. ఆ తర్వాత అర్హులైన రైతులను గుర్తించిన తర్వాత జియాలజిస్టు పరిశీలన అనంతరం అక్కడ భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయన్న విషయాన్ని స్పష్టం చేసిన తర్వాతనే బోరు వేసేందుకు చర్యలు తీసుకుంటారు.

బోరుతోపాటు మోటారు పూర్తి ఉచితం

బోరు బావిలో వారి నిబంధనల ప్రకారం నీటిని పరిశీలించి సంబంధిత రైతుకు ఉచితంగానే బోరు వేస్తూ ఆ రైతుకు మోటారును కూడా పూర్తి ఉచితంగా అందజేస్తారు. విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి ఫీజును సంబంధిత రైతులే భరించాల్సి ఉంటుంది.

అర్హత ఇలా: 2.5 నుంచి 10 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరూ ఈ పథకానికి అర్హులు.

- రైతుకు సుమారు 2.5 ఎకరాల భూమి ఒకే ప్రాంతంలో ఉండాలి
- ఒక రైతుకు ఒక ప్రదేశంలో 2.5 ఎకరాలు భూమి లేనిచో రైతు బృందానికి 2.5 ఎకరాల నుంచి పది ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఒకే ప్రదేశంలో ఉండాలి. అప్పుడు వారికి బోరు బావి మంజూరు చేస్తారు.
- ఐదు ఎకరాలలోపు సన్న, చిన్నకారు రైతులకు మాత్రమే బోరుతోపాటు మోటారు పంపుసెట్టు కూడా ఉచితంగా అందజేస్తారు.
- 5 నుంచి 10 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు బోరు మాత్రమే వేస్తారు.

జిల్లాలో జలకళ ద్వారా వేసిన బోర్ల వివరాలు..

నియోజకవర్గం	మొత్తం బోర్లు	విజయవంతం	విఫలమైనవి
బద్వేలు	390	370	20
జమ్మలమడుగు	63	56	07
కమలాపురం	79	64	15
మైదుకూరు	111	108	03
ప్రొద్దుటూరు	--	--	--
పులివెందుల	73	49	24
రాజంపేట (సిద్దవటం, ఒంటిమిట్ట)	12	12	--
మొత్తం	728	659	69



▸▸ దరఖాస్తు విధానం

అర్హత కలిగిన రైతులు వారి దరఖాస్తులను పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు నకలును జతపరిచి గ్రామ సచివాలయంలో సమర్పించాలి. లేదా హెచ్‌టీటీపీ://వైఎస్సార్‌జలకళ.ఏపీ.జీఓవీ.ఇన్/వైఎస్సార్‌ఆర్‌బీ అనే వెబ్ సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- వచ్చిన దరఖాస్తులను గ్రామ కార్యదర్శి భౌతిక పరిశీలన అనంతరం గ్రామ సచివాలయంలో గ్రామ రెవెన్యూ అధికారి పరిశీలించి అర్హత కలిగిన లబ్ధిదారులకు బోరు వేసేందుకు సిఫార్సు చేస్తారు.
- దరఖాస్తుదారుల వ్యవసాయ భూముల్లో భూగర్భ సర్వే నిర్వహించిన తర్వాత మాత్రమే అర్హత కలిగిన రైతులకు బోరు వేస్తారు. నీరు పడి ఐదు ఎకరాల్లోపు భూమి కలిగిన రైతులకు మాత్రమే మోటారు ఇస్తారు. విద్యుత్ కనెక్షన్ మాత్రం సంబంధిత రైతులే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

జలకళతో రైతులకు ఎంతో మేలు



మాలాంటి పేదవారిని జలకళ పథకం ఎంతో ఆదుకుంటోంది. ఈ పథకం ద్వారా మా భూమిలో బోరు వేసుకుని పైరు సాగు చేస్తున్నాను. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల కోసం ఇలాంటి పథకాన్ని తీసుకు రావడం రైతుల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. – కాక కాశినారాయణ, వరికుంట్ల గ్రామం, కాశినాయన మండలం

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జలకళ పథకం ద్వారా రైతులకు బోరు, మోటారు ఉచితంగా ఇస్తారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలి. సన్న, చిన్నకారు రైతులతోపాటు 10 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది. – పి.యదుభూషణరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కడప

న్యూస్‌రీల్

ప్రొటెక్షన్ వాచర్లకు కిట్లు పంపిణీ



ప్రొటెక్షన్ వాచర్లకు వస్తు సామగ్రి కిట్లు అందజేస్తున్న కడప డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి

సిద్దవటం: సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రొటెక్షన్ వాచర్లకు యూనిఫాం, జంగిల్‌షూ, టార్చిలైట్, వాటర్ బాటిల్, గడియారాన్ని కడప డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొటెక్షన్ వాచర్లు విధి నిర్వహణలో అటవీ ప్రాంతంలో తిరిగేటప్పుడు ఇవన్నీ ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కడప రేంజర్ ప్రసాద్, సిద్దవటం ఇన్‌చార్జి రేంజర్ కె. ఓబులేసు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎఫ్‌బీఓలు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, ఏబీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న పీడీ రవీంద్రనాథరెడ్డి

కడప అగ్రికల్చర్: సూక్ష్మసాగు కోసం నిర్దేశించిన లక్ష్యసాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఏపీ సూక్ష్మనీటి సాగు పథక ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి సూచించారు. శుక్రవారం కడపలోని పీడీ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, కంపెనీ ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 10,500 హెక్టార్లు జిల్లాకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఆ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, జిల్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని అన్ని సచివాలయాల్లో అందించే రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు తెలిపారు. శుక్రవారం కడప నగర శివార్లలోని రంపతాడులో రెండు డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేయించడంలో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రజల ముంగిటకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనేక సేవలు తీసుకు వచ్చారన్నారు. ఈ విషయమై ఇప్పటికే సచివాలయ అధికారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సచివాలయాల్లో మార్టిగేజ్ రశీదు, వీలునామా, తనిఖీ దస్తావేజు, విక్రేత స్థలాలు, స్పెషల్ వివాహాలు, ఇతర అనేక సేవలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సబ్ రిజిస్ట్రార్ శ్యామలాదేవి, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం



అంతర పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సీనియర్ కన్సల్టెంట్ సురేందర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా అరటి పంటలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సీనియర్ కన్సల్టెంట్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇ.కొత్తపల్లె గ్రామ పంచాయతీలో రైతు నారాయణ సాగు చేసిన అరటి పంటను ఆయన పరిశీలించారు. మిరప, బెండ, మటిక, టమాట, వంగ తీగ జాతి బీర, కాకర, గుమ్మడి, మొక్కజొన్న అంతర పంటలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. రైతులు ఏక పంటకు స్వస్తి చెప్పి పలు పంటల విధానంలో పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి, ఎన్‌ఎఫ్‌ఏ నరసింహారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఇంటర్నల్ కమిటీ రిసోర్స్ పర్సన్ ప్రవీణ, రైతులు రవీంద్రారెడ్డి, యామిని, లత తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలుకు అందలం

- సర్కారు పాఠశాల, కళాశాలలో టాపర్‌లకు నగదు అందజేత
- నేడు జిల్లాస్థాయి టాపర్లకు సన్మానంతోపాటు ప్రోత్సాహకాల పంపిణీ

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. దీంతోపాటు నాడు– నేడులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చింది. విద్యార్థులు విద్యలో సమగ్రాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో వారి శ్రేయస్సుకు అనేక కార్యక్రమాలు, పథకాలకు రూపకల్పన చేస్తోంది. తాజాగా ప్రభుత్వ యాజమాన్యాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో నగదు ప్రోత్సాహకాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ముందుగా పాఠశాల స్థాయిలో తొలి మూడు స్థానాలు సాధించిన వారికి రూ. 3 వేలు, రూ. 2 వేలు, వెయ్యి రూపాయలు నగదు బహుమతితో స్థానిక ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రుల కమిటీల సమక్షంలో సత్కరించారు. ఆ తర్వాత 15వ తేదీన నియోజకవర్గ స్థాయిలో పది, ఇంటర్ టాపర్లను నగదుతోపాటు ప్రశంసాపత్రం, మెమెంటోలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే శనివారం జిల్లా స్థాయి టాపర్లను సత్కరించనున్నారు.

జిల్లాస్థాయిలో 40 మంది టాపర్లు..

పదోతరగతి, ఇంటర్మీడియట్‌లలో జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందించనున్నారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ. 50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 30 వేలు, తృతీయస్థానంలో నిలిచిన వారికి రూ. 10 వేలు చొప్పున అందించనున్నారు. ఇంటర్మీడియట్‌ల ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో అత్యధిక మార్కులు సాధించిన వారికి కూడా ఒక్కొక్కరికి రూ. 50 వేలను అందించనున్నారు. పదోతరగతి 26 మంది, ఇంటర్మీడియట్‌లో 14 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిని శనివారం కలెక్టరేట్ స్పందన హాలులో సత్కరించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



నేడు నిర్వహించనున్న జగనన్న ఆణిముత్యాల కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నిర్వహించనున్నాం. ఎంపికైన విద్యార్థులు నిర్ణీత సమయానికి చేరుకోవాలి. – రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

వ్యవసాయ రంగాన్ని లాభాల బాట పట్టించాలి

కలెక్టర్ విజయరామరాజు



వైఎస్సార్ పశు బీమా పత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: వ్యవసాయ, అనుబంధ రంగాలను పటిష్టం చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని లాభాల బాట పట్టించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు లాభాలు ఆర్జించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఆర్బీకేల ద్వారా విస్తృత సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్ల ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగుబడి 72941 హెక్టార్లు కాగా, ఇప్పటికే 176 హెక్టార్లు సాగులోకి వచ్చిందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రాజెక్టుల నుంచి ఖరీఫ్ సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం ముందస్తుగానే సన్నాహాలు చేస్తోందని వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర అందించి అత్యధికంగా సేకరించడం ద్వారా రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ముద్దనూరు ప్రాంతంలో అటవీ ఆవుల సమస్యకు సంబంధించి ఆర్డీఓ, పశు సంవర్ధకశాఖ జేడీ, డీఎఫ్‌ఓలతో విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. జేసీ గణేష్‌కుమార్ మాట్లాడుతూ రాగి, జొన్న, కంది పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. ఆ దిశగా వ్యవసాయశాఖ డివిజన్ల వారీగా లక్ష్యాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పథకం ద్వారా సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. గొర్రెలు, మేకలు, పందులు తదితర పశువులకు కొత్తగా వచ్చిన బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలి

నిబద్ధతతో పనిచేయడం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు సూచించారు. కారుణ్య నియామకాల కింద రెవెన్యూశాఖలో తొమ్మిదిమంది, మిగతా శాఖల్లో 12 మంది కలిపి మొత్తం 21 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. శుక్రవారం వీరికి కలెక్టర్ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవైపు ఉద్యోగ ధర్మాన్ని, మరోవైపు ఇంటి బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్, ఇతర సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితాకు చర్యలు

ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2024ను ఎలాంటి పెండింగ్ లేకుండా సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ విజయరామరాజు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనాకు తెలిపారు. శుక్రవారం సీఈఓ మీనా కలెక్టర్లు, జేసీలతో ఓటర్ల జాబితా సవరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితా సిద్ధం చేయాల్సి ఉందని పేర్కొంటూ అందుకు సంబంధించిన కార్యాచరణపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు దిశా నిర్దేశం చేశారు. ఇప్పటివరకు కొత్తగా 12,480 మంది యువ ఓటర్లు, 256 మంది ట్రాన్స్‌జెండర్లను నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్ చంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్ కేంద్రానికి మహర్దశ

కడప నగరంలోని ప్రతిష్ఠాత్మక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం విస్తరణ, స్థలసేకరణ, భవన నిర్మాణాలకు సంబంధించి సవరించిన అంచనాలతో రూ.6,87,40,000 నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోనే అతిపెద్ద గ్రంథాలయాల్లో ఒకటిగా పాఠకులు, పరిశోధకులకు సేవలందిస్తున్న బ్రౌన్ కేంద్రానికి మహర్దశ పట్టనుంది.

- రూ.6.87 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు
- స్థలసేకరణ, జీ ప్లస్ 2 నిర్మాణానికి వినియోగించుకునేలా ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేసిన అధికారులు



సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సవరించిన అంచనాలతో రూ.6,87,40,000 నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జీఓ నంబర్ 40 విడుదల చేసింది. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని విస్తరించడంలో భాగంగా 2020లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విచ్చేసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.5.5 కోట్ల అంచనాలతో స్థలసేకరణ, నూతన భవన నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం పలు సాంకేతిక కారణాల వలన నిధులు రావడం ఆలస్యం అయింది. అయితే ప్రస్తుత వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు నిధులు రావడంలో గల సాంకేతిక ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి నిధులు సాధించడంలో సఫలీకృతులయ్యారు. ఇందుకోసం కడప పార్లమెంట్ సభ్యుడు వై.ఎస్. అవినాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు, కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సైతం చక్కటి సహకారం అందించడంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. దీంతో గతంలో ప్రకటించిన రూ. 5.5 కోట్లకు అదనంగా రూ. 1.30 కోట్లు పెంచి, సవరించి రూ. 6.87,40,000 విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పెంచిన అంచనాల ప్రకారం రూ. 3,21,40,000 నిధులు స్థల సేకరణకు, 3,66,00,000 నిధులను నూతన భవన నిర్మాణానికి వినియోగించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా గతంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి స్థలం ఉచితంగా అందజేసిన కృష్ణస్వామి, సంపత్‌కుమార్ కుటుంబసభ్యులు మరోసారి తమ దాతృత్వం చాటుకుని ముఖ్యమంత్రి సమక్షంలో ఎంతో విలువైన 5 సెంట్ల భూమిని ఇచ్చేందుకు అంగీకరించి రిజిస్ట్రేషన్ చేయించడం విశేషం. తాజాగా ఉత్తర్వులతో మరో 10 సెంట్లను ప్రస్తుత బ్రౌన్ కేంద్రానికి అనుకుని ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసేందుకు మార్గం సుగమమైంది. దీంతో రానున్న రోజుల్లో మహిళా గ్రంథాలయం, చిన్నారుల గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్న వైవీయూ అధికారుల ప్రణాళికలకు రెక్కలొచ్చినట్లయింది. సీపీ బ్రౌన్ కేంద్రానికి నిధుల విడుదలలో సహకరించిన ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం. మల్లికార్జునరెడ్డిలు ధన్యవాదాలు తెలిపారు.

వీలైనంత త్వరగా నిర్మాణ పనులు



వైవీయూ అనుబంధ సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.6.87 కోట్లు నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. మంజూరైన నిధులతో తొలుత స్థలసేకరణ చేపట్టి, వీలైనంత త్వరగా నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. – ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్, వైవీయూ

20న 'మూడు తరాల ప్రజా సారథి' పుస్తకావిష్కరణ



చాపాడు: తన జీవిత చరిత్రపై ప్రచురితమైన 'మూడు తరాల ప్రజా సారథి' పుస్తక ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితం, రాజకీయ ప్రస్థానంపై మూడు తరాల ప్రజా సారథి పుస్తకాన్ని యువ రచయిత తవ్వా వెంకటయ్య రచించారన్నారు. ఈ పుస్తకావిష్కరణ సభ ఈ నెల 20న ఉదయం 9.30 గంటలకు మైదుకూరులోని కేఎస్ కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల నాయకులు, కవులు, రచయితలు హాజరవుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈమేరకు అందరికీ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

క్లుప్తంగా

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన రహదారిలో చెన్నారెడ్డిపల్లె సమీపంలో శుక్రవారం ఇనుము లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. స్థానికుల సమాచారం మేరకు.. తాడిపత్రి వైపు నుంచి వస్తున్న లారీ నడిరోడ్డుపై బోల్తా పడింది. అయితే ఈ సమయంలో ఎటువంటి వాహనాలు రహదారిపై లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ప్రమాదం సంభవించలేదు.

కూల్‌డ్రింక్స్ దుకాణంలో చోరీ



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న ఓ కూల్‌డ్రింక్స్ దుకాణంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. విద్యానగర్‌కు చెందిన శేషగిరిరావు మార్కెట్‌యార్డు సమీపంలో కొన్నేళ్లుగా కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహిస్తుండేవాడు. రోజూ మాదిరే గురువారం రాత్రి దుకాణం మూసివేసి తిరిగి శుక్రవారం ఉదయం తెరిచేందుకు రాగా అప్పటికే తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు గ్రహించి వెంటనే అర్బన్ పోలీసులకు సమాచారమిచ్చారు. అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దుకాణంలో దాచి ఉంచిన రూ.40 వేల నగదుతోపాటు 28 గ్రాముల నల్లపూసల దండ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

గుర్రంకొండ : డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన గుర్రంకొండలో జరిగింది. మండలంలోని సరిమడుగు పంచాయతీ క్రిష్టాపురం గ్రామానికి చెందిన పాలకుంట రెడ్డెప్ప కుమార్తె సాయిరేఖ(18) గుర్రంకొండ పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 13న కళాశాలకు వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరింది. అయితే సాయంకాలం కళాశాల సమయం ముగిసినా ఇంటికి చేరుకోలేదు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు విద్యార్థిని ఆచూకీ కోసం గాలించినా జాడ తెలియరాలేదు. విద్యార్థిని తండ్రి రెడ్డెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఆకాశవాణికి అరవై ఏళ్లు

- కడప కేంద్రానికి షష్టిపూర్తి
- కళాకారులతో కళకళలాడిన కేంద్రం



కడప ఆకాశవాణి కేంద్రం

కడప కల్చరల్ : ఆకాశవాణి కడప కేంద్రం.. 333.3 మీటర్లు అనగా 900 కిలో హెర్ట్జ్‌పై ప్రసారం... అంటూ ఓ మృదు మధురమైన స్వరం ఉదయాన్నే సుప్రభాతంలా వినిపిస్తుంది. ఆ వెంటనే కమ్మని సంగీతం చెవిని సోకుతుంది. ఎంత వారికైనా ఆ క్షణంలో నిద్రమత్తు వదిలిపోతుంది. ఆ ఉదయం హుషారుగా గడిచేందుకు తగినంత ఉత్సాహాన్ని ఇస్తుంది. నేటికీ ఈ అనుభూతికి 60 ఏళ్లు.

ఆకాశవాణి కడప కేంద్రం గురించి తెలిసిన, ఆ కేంద్రానికి చెందిన ప్రసారాలు విన్న మొన్నటితరం వారికి పై వ్యాఖ్యానం అనుభవమే. ఈ కేంద్రం 1963లో జిల్లా కేంద్రమైన కడప నగరంలో ప్రారంభమైంది. నాటి కేంద్ర ప్రసారశాఖ మంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. తొలుత ఈ కేంద్రం కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలోని ప్రైవేటు భవనంలో ఉండేది. 1986లో ఎస్పీ బంగ్లా పక్కన విశాలమైన స్థలంలో సుందరమైన సొంత భవనంలోకి మారింది. 1983లో 100 కిలోవాట్ల ట్రాన్స్‌మీటర్ సామర్థ్యంతో అప్‌గ్రేడ్ అయింది. రాయలసీమతోపాటు సమీప జిల్లాలలో కూడా ఈ కేంద్రానికి చెందిన కార్యక్రమాలు ప్రసారం అయ్యేవి. నాటి ప్రముఖులు మహాకవి, సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు, కళాకారులు, సంగీత దర్శకులు, నట గాయకులు కొండపేట కమాల్‌తోపాటు మరికొందరు ప్రజాప్రతినిధులు కడపలో ఆకాశవాణి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తమదైన శైలిలో ఉద్యమించారు. ఆ తర్వాత ఈ కేంద్రం అప్‌గ్రేడేషన్ కోసం మాజీ ఎమ్మెల్సీ షేక్ హుసేన్ తదితరులు పోరాడారు.

కళాకారులతో కళకళ

ఆకాశవాణి కడప కేంద్రం ప్రారంభం నుంచి నిత్యం కళాకారులతో కళకళలాడేది. స్వయంగా నటులు, గాయకులైన ఆరవేటి శ్రీనివాసులు, సినీ నటుడు, రచయిత గొల్లపూడి మారుతిరావు కడప స్టేషన్‌కు బాధ్యునిగా ఉండడంతో ఆయనతో పరిచయం గల జానపద గాయకుడు మునెయ్య లాంటి కళాకారులు ఈ కేంద్రం ద్వారా తమ ప్రతిభను చాటుకునేవారు. అంతేకాకుండా సీమలోని సంగీత, నాటకరంగ కళాకారులు, కవులు, రచయితలు ప్రతిభను చాటుకునేందుకు ఈ కేంద్రం గొప్ప వేదికగా ఉండేది. సీమ గ్రామీణ జీవితంపై మంచి పట్టుగల సుబ్బన్న లాంటి వ్యక్తి గ్రామ సీమలు కార్యక్రమం రూపకర్తగా ఉండడంతో ఆకాశవాణికి గ్రామ సీమల్లో గొప్ప పట్టు ఏర్పడింది. ఇతర ప్రాంతాలకు చెందిన పలు కళారూపాలు, స్థానిక సంప్రదాయ కళలకు చెందిన ప్రసారాలు కూడా విరివిగా అలరించేవి. ఇక్కడి ప్రముఖ రచయితల కవిత్వం ఎంతగానో అలరించేది. ఈ ప్రాంత రంగస్థల నాటకాలు ఈ కేంద్రం ద్వారా ప్రసారమై జాతీయ స్థాయి బహుమతులు సాధించి పెట్టడంతో ఈ కేంద్రం విజయబావుటాను ఎగురవేసింది. మొన్నటితరంలో చాలా మందికి ఆకాశవాణి ప్రసారాలు వినడం వ్యసనంగా ఉండేది. 2015 వరకు ఆకాశవాణి కడప కేంద్రానికి ప్రముఖ కవి శశిశ్రీ ప్రతినిధిగా వ్యవహరించారు. మొత్తంపై తెలుగు నాట ఆకాశవాణి కడప కేంద్రం విలక్షణమైన కార్యక్రమాలతో ప్రత్యేక గౌరవం సాధించింది. సుదీర్ఘ కాలం ఈ కేంద్రం విజయవంతంగా కొనసాగుతుండడం పట్ల ఆ కేంద్రం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంత గొప్ప కేంద్రంలో తాము సేవలు అందించే అవకాశం లభించినందుకు గర్విస్తున్నామన్నారు. 60 ఏళ్లను పురస్కరించుకుని శనివారం ఉదయం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు.

రైలు ప్రమాదాలు జరగకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న గుంతకల్లు డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల ఒడిస్సాలో జరిగిన రైలు ప్రమాదంలో వందలాది మంది మృతి చెందారని, అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని గుంతకల్లు రైల్వే డీఆర్‌ఎం వెంకట రమణారెడ్డి తెలిపారు. గుంతకల్లు డివిజన్‌లోని గుంతకల్లు నుంచి తిరుపతి వరకు రైలు ప్రమాదాల నివారణపై కడప రైల్వేస్టేషన్‌లో శుక్రవారం సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేబోర్డు ఆదేశాల మేరకు ఆయా డివిజన్లలోని రైల్వే అధికారులు, సిగ్నల్, ఇంజినీరింగ్ తదితర అధికారులతో సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. రైల్వే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అప్పుడే ప్రమాదాలను నివారించగలమన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు రైల్వే అధికారులు అక్కిరెడ్డి, మల్లికార్జున, కడప రైల్వే అధికారులు రాధాకృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఎస్‌ఎంఆర్ నరసింహారెడ్డి, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, జీఆర్‌పీఎఫ్ సీఐ నాగార్జున, ఎస్‌ఐ రారాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ముద్దనూరు : రైలు ప్రయాణంలో ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా వుండాలని గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజరు వెంకట రమణారెడ్డి రైల్వే అధికారులను ఆదేశించారు. శుక్రవారం డీఆర్‌ఎం స్థానిక రైల్వేస్టేషన్‌లో సిబ్బందితో రైల్వే భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతకు రైల్వే అధిక ప్రాధాన్యం కల్పిస్తోందని, సిబ్బంది ట్రాక్ నిర్వహణ, సిగ్నల్, రైళ్ల రాకపోకలు తదితర అంశాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ముద్దనూరు–జమ్మలమడుగు రహదారిలో రైల్వేగేటు వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని, రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఇతర నాయకులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజరు భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు రైల్వే క్రూ సెంటర్ తరలించవద్దు

రాజంపేట : బ్రిటీషు కాలం నాటి నందలూరు రైల్వే రన్నింగ్ స్టాఫ్ క్రూ సెంటర్‌ను తరలించవద్దని, నందలూరు రైల్వేకేంద్రాన్ని నిర్వీర్యం చేయొద్దని నందలూరుకు చెందిన నేతలు గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ వెంకటరమణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. గుత్తి–రేణిగుంట రైలు మార్గంలో శుక్రవారం పలు రైల్వేస్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ క్రమంలో నందలూరు రైల్వేకేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయపార్టీలకు చెందిన నేతలు ఆయనకు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. వెంకటాద్రి, జయంతి, చెన్నై–ముంబై మధ్య నడిచే రైళ్లకు నందలూరులో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యువనాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఐకేపీఎస్ అధ్యక్షుడు మస్తానయ్య, రైల్వేసాధన సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విద్యతోపాటు క్రీడలు, కళలను పెంపొందించినప్పుడే విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధి చెందుతాడని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కడప చెమ్ముమియాపేట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, నిపున్ భారత్ ముగింపు కార్యక్రమాన్ని హెచ్‌ఎం మేరీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిల్ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి వాటిపై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల నైపుణ్యాలు పెంపొందిస్తారని, వాటి ద్వారా సమాజంలో ఏ రంగంలోనైనా ముందుకు పోగలరన్నారు. అనంతరం విద్యార్థులకు జాతీయ భక్తిగీతాల ప్రదర్శన, భగవద్గీత, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ ధనలక్ష్మి, సీఎంఓ కేశవరెడ్డి, అసిస్టెంట్ సీఎంఓ దశరథరామిరెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓ రామాంజనేయుల రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ టీం



రికార్డులు పరిశీలిస్తున్న న్యాక్ కమిటీ చైర్‌పర్సన్ ఆచార్య నీలిమాగుప్తా

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కమిటీ) పీర్ కమిటీ శుక్రవారం పరిశీలించింది. కళాశాల ఏర్పాటైన తర్వాత మూడో సైకిల్‌లో భాగంగా, స్వయంప్రతిపత్తి సాధించిన తర్వాత నిర్వహించిన తర్వాత తొలిసారిగా న్యాక్ కమిటీ పరిశీలనకు విచ్చేసింది. 2006లో తొలిసారిగా, 2014లో రెండోసారి న్యాక్ కమిటీ విచ్చేసి కళాశాలకు న్యాక్ 'బి' గ్రేడ్ కేటాయించిన సంగతి తెలిసిందే. కాగా మూడోసారి నిర్వహించిన న్యాక్ టీం పరిశీలనకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని సీఎస్‌జేఎం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య నీలిమా గుప్తా నేతృత్వం వహించారు. ఈమెతోపాటు హైదరాబాద్‌కు చెందిన ది ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ లక్ష్మి హరిబండి మెంబర్ కోఆర్డినేటర్‌గా, చెన్నైకి చెందిన క్వీన్‌మేరీస్ పూర్వపు ప్రిన్సిపాల్ ఆచార్య రెహమాన్ షరీఫ్ అక్తర్ బేగం సభ్యులుగా గల న్యాక్ టీంకు కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ గౌరవ వందనంతో స్వాగతం పలికారు. న్యాక్ టీంకు కళాశాల అభివృద్ధి, బోధన, పరిశోధన, మౌలిక సదుపాయాల గురించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్బలక్షుమ్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం న్యాక్ కమిటీ సభ్యులు బృందాలుగా ఏర్పాటై తొలిరోజు 10 డిపార్ట్‌మెంట్‌లను పరిశీలించారు. అనంతరం సాయంత్రం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలను న్యాక్ కమిటీ ప్రతినిధులు తిలకించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ గురివిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మదనపల్లె : దళిత యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతోపాటు, బెదిరింపులకు పాల్పడి కులం పేరుతో దూషించిన ఘటనలో నిందితుడితోపాటు మరో ఆరుగురు కుటుంబ సభ్యులు, స్నేహితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని కమ్మగడ్డ ఎక్స్‌టెన్షన్‌లో నివాసముంటున్న తేజస్వినికి ఎస్‌బీఐ కాలనీలో నివాసముంటున్న మధుసూదన్‌నాయుడు కుమారుడు రాంచరణ్‌నాయుడు పది నెలల క్రితం పరిచయమయ్యాడు. పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. యువతిని తీసుకుని బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని తన స్నేహితుల ద్వారా కూడా చెప్పించాడు. ఇటీవల తేజస్విని పెళ్లి చేసుకోవాలని కోరగా.. నిరాకరిస్తూ కులం పేరుతో దూషించాడని, అతని తల్లి మధుర, అన్న నగేష్, వదిన ప్రియాంక, అతని స్నేహితులు ఫారూఖ్, సులేమాన్, బాలుతో కలిసి దౌర్జన్యం చేశారని బాధితురాలు తెలిపారు. అక్రమంగా ఇంటిలోకి ప్రవేశించి కులం పేరుతో తిడుతూ దౌర్జన్యానికి పాల్పడి భయపెట్టాడని పేర్కొన్నారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రాంచరణ్‌నాయుడు కొంత డబ్బు తీసుకున్నాడని, ప్రస్తుతం ఆ నగదు చెల్లించడానికి నిరాకరిస్తూ దౌర్జన్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. ఈ మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రిమాండ్ ఖైదీ కోసం గాలింపు చర్యలు

కొండాపురం : పోలీసుల కళ్లు గప్పి తప్పించుకున్న రిమాండ్ ఖైదీ నాగిరెడ్డి కోసం పోలీసు బృందాలు శుక్రవారం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం వీరాపురంలో నివాసం ఉండే నాగిరెడ్డిపై పలు జిల్లాల్లోని పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు ఉన్నాయి. గతేడాది కొండాపురంలో జరిగిన దొంగతనం కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం గురువారం కర్ణాటక రాష్టంలో ధార్వాడ్ కారాగారం నుంచి జమ్మలమడుగు న్యాయస్థానానికి నిందితుడిని తీసుకొచ్చారు. తిరిగి ధార్వాడ్ కారాగారానికి తీసుకెళ్తుండగా రాత్రి మార్గంమధ్యలో కొండాపురం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. అతని కోసం పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. నాగిరెడ్డిపై మొత్తం 90 కేసులు నమోదు అయినట్లు సమాచారం. అంతర్ రాష్ట్రాల్లో చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

- రెండు, మూడు రోజుల్లో రానున్న రుతుపవనాలు
- జిల్లాకు 2636 క్వింటాళ్ల విత్తనాలు కేటాయింపు
- ఆర్‌బీకేల ద్వారా పంపిణీ



పెన్నా సమీపంలో మాచుపల్లె వద్ద సాగులో ఉన్న జనుము

కడప అగ్రికల్చర్ : నైరుతి రుతు పవనాలు రాయలసీమను తాకనున్నాయి. మరికొన్ని రోజుల్లో వర్షాలు కురువనున్నాయన్న సూచనలతో రైతులు పొలంబాట పట్టారు. ఈ ఏడాది జిల్లాలో 77,105 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా ఉండగా.. ఇందులో 33,125 హెక్టార్లలో సాధారణ వరి పంట సాగు కానుందని అధికారులు అంచనాలు తయారు చేశారు. కానీ అంతకంటే ఎక్కువగానే వరి పంట సాగు కానుంది. ఇందులో ముఖ్యంగా కేసీ కెనాల్‌తోపాటు కుందూ, పెన్నా, బోర్ల కింద వరి పంటను సాగు చేయనున్నారు. ఈ మేరకు రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుములను సబ్సిడీపై జిల్లాకు 2336 క్వింటాళ్లను అధికారులు కేటాయించారు. సంబంధిత విత్తనాల పంపిణీ జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనసాగుతుంది. ఈ క్రమంలో వాతావరణ అనుకూలతను ఆసరాగా చేసుకుని పచ్చిరొట్ట సాగు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. కేవలం 45 రోజుల వ్యవధిలోనే పచ్చిరొట్ట పూతదశకు చేరుకుంటుంది. వరి నాట్లు వేసే సమయానికి ఈ పంట అదునుకు వస్తుంది. ప్రస్తుతం రసాయనిక ఎరువుల వాడకం గణనీయంగా పెరగడంతో భూమి నుంచి పైరుకు అవసరమైన పోషకాలు లభించడం లేదు. వీటి సాగు వల్ల భూమికి కావాల్సిన పోషకాలు అందనున్నాయి.

ప్రయోజనాలు మెండు

పచ్చిరొట్ట పైరులైన జీలుగ, జనుము, పిల్లపెసర వల్ల సేంద్రియ పదార్థాలు భూమికి లభిస్తాయి. భూమిలో కలుపు మొక్కల నివారణ జరుగుతుంది. దీంతోపాటు మొక్కలకు కావాల్సిన అన్ని పోషకాలు మెండుగా లభిస్తాయి. కృత్రిమంగా వాడుతున్న నత్రజని వినియోగం తగ్గుతుంది. రసాయన ఎరువులు భూమి అంతర పొరలకు చేరిపోకుండా అడ్డుకట్ట వేయవచ్చు. నేలలో చౌడును తగ్గిస్తూ భూ అంతర్ పొరల్లో ఉష్ణోగ్రత సమతుల్యతను కాపాడుతుంది. ముఖ్యంగా చౌడు భూముల్లో జనుము సాగు చేసి సేద్యం చేసుకుంటే మంచిది.

ఎకరాకు ఎంత మోతాదులో..

జీలుగ, పిల్ల పెసర ఎకరాకు 16 కిలోలు, జనుము 20 కిలోల వంతున చేయాల్సి ఉంటుంది. పచ్చిరొట్ట పూత సమయంలో పంట భూమిలో కలియదున్నడంతో నత్రజని 1.8 నుంచి 3.5 శాతం సమకూరుతుంది. భాస్వరం 0.1 నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2.0 శాతం భూమికి లభిస్తుంది. ఈ పచ్చిరొట్ట వల్ల రసాయనిక ఎరువుల వాడకం 30 శాతం మేర తగ్గించుకోవచ్చు. పచ్చిరొట్టతో భూమికి అవసరమైన కాల్షియం, నత్రజని, మాంగనీసు, గంధకం, జింకు వంటి సూక్ష్మ ధాతువులు పుష్కలంగా సమకూరుతాయి. నీటి నిల్వలు భూమి లోపల పొరలలో నిల్వ ఉండి సేద్యానికి సహకరిస్తాయి. భూమి ఆరోగ్యవంతంగా మారుతుంది.

ఆర్‌బీకే ద్వారా విత్తనాలు




పచ్చిరొట్ట సాగుతో భూసారం మెరుగుపడుతుంది. ఆర్‌బీకేల ద్వారా 50 శాతం రాయితీపై విత్తనాలను అందిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలోని పలు రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ సాగుతుంది. ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే విత్తనాలను రైతులు సకాలంలో తీసుకుని చల్లుకోవాలి.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి, కడప

నాడు ఘనం.. నేడు దైన్యం

- చరిత్రలో కలిసిపోయిన హార్సిలీహిల్స్ పట్టు కేంద్రం
- ఉమ్మడి రాష్ట్ర పట్టు రైతాంగానికి విశేష సేవలు
- శాశ్వత సెలవు తీసుకున్న పట్టు కేంద్రం



మూతపడిన పట్టు కేంద్రం

బి.కొత్తకోట : పట్టు ఉత్పత్తిలో రికార్డులు మూటగట్టుకొన్న బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ మూలబీజ క్షేత్ర కేంద్రం (పీ–3స్టేషన్) చరిత్ర భావితరాలకు తెలియని స్థితిలో పడింది. సమైక్య రాష్ట్రంలోని పట్టురైతులకు అత్యంత విలువైన సేవలందించిన ఈ కేంద్రం మూతపడి ప్రాభవాన్ని కోల్పోగా నిరుపయోగమైంది. హార్సిలీహిల్స్‌పై 1981 మే 5న అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ కేసీ.అబ్రహం పట్టుకేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన పట్టు గుడ్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతాంగానికి సరఫరా చేయడం ప్రధాన ఉద్దేశం. ఇక్కడి చల్లటి ఆరోగ్యకరమైన వాతావరణంలో గుడ్ల ఉత్పత్తికి అనుకూలమైంది కావడంతో మంచి నాణ్యతతో కూడిన ఫలితాలు వచ్చేవి. మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీ మొగసాలమర్రి వద్దనున్న ఫారం నుంచి ఆకులు తరలించే వారు. కర్ణాటకలోని మైసూరు సెంట్రల్ సెరికల్చర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అందజేస్తున్న పి–3 రకాన్ని ఇక్కడ అభివృద్ధి చేసి పీ–2 రకాన్ని తయారు చేయడం కోసం చైనా, థాయ్‌లాండ్, జపాన్, కొరియా దేశాలు అనుసరించే పద్ధతులను అవలంబించారు. హార్సిహిల్స్‌పై ఉత్పత్తి చేసే పీ–2 రకం గుడ్లను ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా జరిగేది. ఈ గుడ్లతో పట్టు ఉత్పత్తి జరిగేది. వేలాది ఎకరాల్లో రైతులు మల్బరీ సాగుచేసేవారు. ఈ పట్టు పురుగులకు ఎలాంటి రోగాలు సోకుండా రీలింగ్ నాణ్యత, లార్వా ప్యూపాదశ మారడం, కకున్ బరువు, సిల్క్ బరువు, నాణ్యతగా ఉండేవి. అయితే మారిన వాతావరణ పరిస్థితులు, పట్టు సాగు ప్రభావంతో మొన్నటి దాకా ఒక గదిలో కొనసాగిన కార్యకలాపాలు ప్రస్తుతం పూర్తిగా నిలిపివేయడంతో కేంద్రం పూర్తిగా మూతపడింది.

మిగిలింది గత చరిత్రే

గతమెంతో ఘనకీర్తి కలిగిన ఈ పట్టు కేంద్రం గురించి చెప్పుకోవడానికి ఇప్పుడు మిగిలింది గత చరిత్రే. దీన్ని 1993లో అప్పటి సీఎం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి సందర్శించారు. ప్రస్తుతం ఇక్కడి భవనాలు, రేరింగ్, చాకీ గదులన్నీ మూసేశారు. ఒక గది పట్టు కేంద్రం గురించిన గత వైభవాన్ని చాటిచెప్పే ప్రదర్శనశాలగా ఉండేది. అప్పట్లో ఉత్పత్తి చేసిన నాణ్యమైన, అత్యధిక బరువు కలిగిన గుడ్లు, వాటితో తయారైన నాణ్యమైన పట్టుదారం ప్రదర్శనలో ఉంచారు. ఇక్కడ సాగు చేసిన మల్బరీ, గుడ్ల ఉత్పత్తికి సంబంధించిన వివరాలతో కూడిన ఫొటోలు, ఛాయచిత్రాలు ఉండేవి. 40 ఏళ్ల క్రితం నాటి ఈ పట్టుదారం, గుడ్లు పురాతనమైనవి కావడంతో వీటన్నింటిని చిత్తూరులోని జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి తరలించి భద్రపరిచారు.

మూడు ముక్కలాట

35 ఏళ్ల క్రితం ఇక్కడ ప్రారంభించిన పట్టుక్షేత్రానికి చెందిన భవనాలు ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ శాఖలు దీన్ని మూడుముక్కలాట ఆడుకున్నాయి. గత టీడీపీ హయాంలో ఈ భవనాలను క్రీడా శిక్షణ కోసం కేటాయించాలని ప్రతిపాదించారు. అలాగే ఇక్కడ పరిశోధనలు చేయడం కోసం హిందూపురం పట్టుశాఖ పరిశోధనా కేంద్రం కోసం కేటాయింపు చేశారు. తాజాగా ఈ భవనాలు, భూమిని పర్యాటకశాఖకు అప్పగించారు. దీనితో దశాబ్దాలుగా ఓ వెలుగు వెలిగి పట్టు రైతుల కుటుంబాలకు ఆర్థిక ఎదుగుదలకు మూల కారణమైన పట్టు కేంద్రం చరిత్రలో కలిసిపోయింది. ఇప్పుడీ కేంద్రం ముళ్లకంపలు, పొదలతో నిండిపోయింది. సందర్శకులు ఈ ఆవరణలో కూర్చుని విందులు చేసుకుంటూ సేద తీరుతున్నారు. దీనిపై ఏడీ బాబు మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌పై పట్టు కేంద్ర కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేశామని తెలిపారు.